T/AP/2024/0929/688/1180



G.Rajesh
CMD, INB MEDIA GROUP

# INB TIMES

తెలుగు దినపత్రిక     Telugu Daily News Paper





ప్రచురణ: , తెలంగాణ     సంపుటి : 03     సంచిక : 36     ఎడిటర్ : జి.రాజేష్     గురువారం 30 ఏప్రిల్ 2026     పేజీలు : 6     వెల రూ. 4.00



## దేశంలో ఎప్పుడు ఎన్నికలు జరిగినా కాంగ్రెస్‌దే విజయం

- దేశంలో బిజెపి కులమతాల పిచ్చి రేపుతోంది
- ప్రధాని పదవిని కూడా రాహుల్ గాంధీ త్యాగం చేశారని..
- పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్

2 లో



## చంద్రబాబుకు బిజినెస్ రిఫార్మర్ అవార్డు

- టీమ్ స్పిరిట్ వల్లనే రాష్ట్రానికి పెట్టుబడులు
- మంత్రులు, అధికారులకు నేడు బాబు విందు

# ప్రజలకోసం పాటుపడుతూ..
# పార్టీ కోసం కష్టపడాల్సిందే




- పార్టీ కోసం కష్టపడ్డవారికే పదవులు
- ఎంత సీనియర్ అయినా పట్టించుకోను
- దేశంలో అత్యంత క్రమశిక్షణ కలిగిన పార్టీ టిడిపి
- పార్టీ అభివృద్ధి కార్యక్రమాల అమలుకు లోకేశ్ విశేష కృషి
- సామాన్య మహిళా కార్యకర్తకు పొలిట్‌బ్యూరోలో స్థానం కల్పించాం
- వచ్చే ఎన్నికల్లో ఇప్పటికన్నా రెట్టింపు ఓట్లు రాబట్టుకునేలా కృషి
- టిడిపి కార్యవర్గ ప్రమాణస్వీకారంలో చంద్రబాబు పిలుపు

అమరావతి,ఐఎన్‌బిటైమ్స్ : తెలుగుదేశం పార్టీ అభివృద్ధికి, రాష్ట్ర పురోగతికి కృషి చేసిన వారికే పార్టీ పదవుల్లో పెద్దపీట వేస్తామని తెలుగుదేశం అధ్యక్షుడు , ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. సీనియారిటీ ఉంటే పదవులు రావని, సిన్సియార్టీతో పనులు చేసేవారిని ఆదరిస్తామని అన్నారు. తనకు అత్యంత దగ్గర వారైనా కప్పు కాఫీ ఇచ్చి పంపుతానే తప్ప, పార్టీ పదవులు అప్పగించి తప్పు చేయనని స్పష్టం చేశారు. తాను గుడ్డిగా ఎవరికీ బాధ్యతలు అప్పగించనని, రాష్ట్ర ప్రయోజనాలు కాపాడేవారినే ప్రోత్సహిస్తానని చంద్రబాబు నాయుడు తేల్చి చెప్పారు. బలమైన కేడర్ కలిగిన ఏకైక పార్టీ టీడీపీ అని అన్నారు. దేశంలో టీడీపీలాగా క్రమశిక్షణ కలిగిన పార్టీ ఎక్కడా లేదని అభిప్రాయపడ్డారు. బుధవారం తెలుగుదేశం పార్టీ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకార కార్యక్రమం ఘనంగా



జరిగింది. మంగళగిరి పార్టీ కార్యాలయంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నేతృత్వంలో పొలిట్ బ్యూరో, జాతీయ, రాష్ట్ర కమిటీల సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సంద ర్భంగా చంద్రబాబు మాట్లాడు తూ..' కార్యకర్తే అధినేత అనే మన సిద్ధాంతాన్ని ఆచరణలో చూపిద్దాం. లోకేష్ పార్టీలో ప్రక్షాళన తెచ్చి కార్యకర్తలకు బీమా కల్పించారు.



## తెలుగుదేశం కార్యవర్గ ప్రమాణ కార్యక్రమం

**పాతకొత్తల కలయికతో పలువురికి పదవులు**
**ప్రత్యేక ఆకర్శణగా నిలిచిన లోకేశ్**

అమరావతి,ఐఎన్‌బిటైమ్స్
తెలుగుదేశం పార్టీ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకార కార్యక్రమం ఘనంగా జరిగింది. ముఖ్యమంత్రి నారా చంద్ర బాబు నాయుడు నేతృత్వంలో పొలిట్ బ్యూరో, జాతీయ, రాష్ట్ర కమిటీల సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా నారా లోకేష్ బాధ్యతలు స్వీకరించారు. పార్టీ అధినాయకత్వం పాత, కొత్త నాయకుల కలయికతో కమిటీలను ఏర్పాటు చేయడం

- మిగతా 2లో

## జైళ్లశాఖ పాత్ర సమాజంలో కీలకం

**ఖైదీలను సరిదిద్దే ప్రధాన బాధ్యత**
**ఢిల్లీ జైలు సిబ్బందికి శిక్షణ కార్యక్రమంలో డిజిపి**




మిగతా 2లో



# డిసెంబర్ నాటికి అన్ని ప్రభుత్వ సేవలూ ఆన్‌లైన్

- శరవేగంగా డ్రోన్ సిటీ మొదటి దశ పనులు
- శాటిలైట్ సమాచారం వినియోగించుకునేలా కార్యాచరణ
- ముఖ్యమంత్రి చంద్రబాబు

అమరావతి, ఐఎన్‌బిటైమ్స్
ప్రభుత్వ శాఖలు అందిస్తున్న అన్ని సేవలు ఈ ఏడాది డిసెంబర్ నాటికల్లా ఆన్‌లైన్‌లో అందించాలని ముఖ్య మంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. వాట్సప్ గవర్నెన్స్ మన మిత్ర పరిధిలోకి అన్ని సేవలు తీసుకు వస్తే ప్రజలకు ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరిగే పని ఉండదని చెప్పారు. ఆర్టీజీఎస్‌పై వివిధ శాఖల ఉన్నతాధికారులతో క్యాంపు కార్యాలయంలో బుధవారం ముఖ్యమంత్రి సమీక్ష నిర్వహించారు. మనమిత్ర వాట్సప్ గవర్నెన్సు ద్వారా ప్రస్తుతం 1,035 సేవలు అందిస్తున్నామని తెలిపారు. వాట్సప్ గవర్నెన్సు సేవలు ప్రారంభించిన దగ్గర నుంచి ఇప్పటి వరకు రాష్ట్రంలో 54 లక్షల మంది 1.78 కోట్ల సేవలు పొందారని ఈ సందర్భంగా ముఖ్యమంత్రికి అధికారులు వివరించారు. వాట్సప్ గవర్నెన్స్ సేవల వినియోగం



## ప్రజారోగ్య సంరక్షణ కోసం వినూత్న పథకం

- రోగాల ముందస్తు నివారణ లక్ష్యంగా ఒక్కొక్కరికి 47 రకాల పరీక్షలు
- ముఖ్యమంత్రి హామీ అమలు దిశగా నిర్ణయం
- సాలీనా రూ.163 కోట్ల వ్యయంతో పరీక్షలు
- త్వరలో 104 సంచార వైద్య వాహనాల ద్వారా సేవలు
- పథకాన్ని ఆమోదించిన మంత్రి సత్యకుమార్ యాదవ్

## రాష్ట్రంలో పర్యాటక రంగానికి కొత్త కళ

- హైదరాబాద్‌లో భారీ స్థాయిలో కార్నివాల్ నిర్వహణ
- పర్యాటక కేంద్రాల్లో వారాంతపు సాంస్కృతిక ప్రదర్శనలు
- పర్యాటకశాఖ అధికారులతో సమీక్షలో మంత్రి జూపల్లి



హైదరాబాద్,ఐఎన్‌బిటైమ్స్
రాష్ట్రంలో పర్యాటక రంగానికి కొత్త కళ తీసుకురావాలని ఉన్నతాధికారులను రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు ఆదేశించారు. బుధవారం హైదరాబాద్‌లో మంత్రి జూపల్లి కృష్ణారావు అధ్యక్షతన పర్యాటక మండలి సమావేశం జరిగింది. ఈ సందర్భంగా రాష్ట్రంలో పర్యాటక రంగానికి కొత్త శోభను తీసుకొచ్చేందుకు పలు అంశాలపై మంత్రి

మిగతా 2లో

## తెలంగాణ టెన్త్ ఫలితాలు విడుదల

- మొత్తం 95.1 శాతం ఉత్తీర్ణత 96.26 శాతం
- ఉత్తీర్ణతతో ముందున్న బాలికలు
- ఫలితాల్లో ములుగు జిల్లా ఫస్ట్..హైదరాబాద్ లాస్ట్

2లో



# ప్రజలకోసం పాటుపడుతూ..పార్టీ కోసం కష్టపడాల్సిందే

ప్రతి పోలింగ్ బూత్‌లోనూ మనం బలపడాలి. వచ్చే ఎన్నికల్లో 2024లో వచ్చిన ఓట్ల కంటే ఎక్కువ రావాలి. అన్ని సమీకరణలు చూసి కార్యవర్గాన్ని ఎంపిక చేశాం. సీనియారిటీ, సిన్సియారిటీ, కమిట్‌మెంట్ చూసి పదవులకు ఎంపిక చేశాం. 4 దశాబ్దా లుగా కమిటీలను నియమిస్తున్నాం. కానీ, ఇంతవరకు ఎప్పుడూ ఇంత కసరత్తు చేయ లేదు. సీనియర్లను గౌరవిస్తూ కొత్తవారికి అవకాశం ఇచ్చాం. ఒక మండల పార్టీ నేతను పొలిట్ బ్యూరో మెంబర్‌ను చేశాం. సామాన్య కార్యకర్తలకు పార్టీలో పదవులొ చ్చాయి' అని అన్నారు. ఒక్క ఓటమితోనే రాజకీయ పార్టీలు చాపచుట్టేస్తున్నాయి. గెలిచినా.. ఓడినా.. సగర్వంగా ఎగిరే జెండా పసుపు జెండా. 44 ఏళ్లలో అనేక సంక్షోభాలు, సవాళ్లను చూశాం. పసుపు జెండా పౌరుషం ఎప్పుడూ తగ్గలేదు. 2024 ఎన్నికల్లో వచ్చిన ఓట్ల కంటే వచ్చే ఎన్నికల్లో అధికంగా రావాలని దిశానిర్దేశం చేశారు. కార్యకర్తే అధినేత అనేది మన సిద్దాంతం.. ఆచరణలో చేసి చూపించాం అని చంద్రబాబు అన్నారు. తెలుగు జాతి ఉన్నంతకాలం తెలుగుదేశం పార్టీ కొనసాగుతుందని చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. పార్టీ కార్యకర్తలే అసలు బలం అని పేర్కొన్నారు. తెలుగుదేశం కార్యకర్తలు ఎప్పుడూ మీసం మెలేస్తారని, ఎవరికీ తలవంచరని అన్నారు. నూతన కమిటీలను ఎన్నో వడపోతలు, వ్యూహాలతో ఏర్పాటు చేశామని చంద్రబాబు తెలిపారు. కార్యకర్తే అధినేత అనే నినాదాన్ని కేవలం మాటలకే పరిమితం చేయకుండా విధానంగా మార్చుకున్నామని పేర్కొన్నారు. మహిళలకు అధిక ప్రాధాన్యం ఇచ్చామని, మహిళా బిల్లుకు పూర్తిగా మద్దతు ఇచ్చామని చెప్పారు. చదువుకున్న వారికి మంత్రి పదవులు ఇచ్చి ప్రోత్సహిస్తున్నామని వెల్లడించారు చంద్రబాబు.. రామ్మోహన్ నాయుడు, శబరి, రాజేష్ వంటి యువ నాయకులను జాతీయ ఉపాధ్యక్షులుగా నియమించామని తెలిపారు. ప్రతిపక్షంలో ఉన్న సమయంలో నారా లోకేష్ కీలక పాత్ర పోషించారని, ట్రైనింగ్ క్లాసులు నుంచి కార్యకర్తల సంక్షేమం వరకు సమర్థవంతంగా నిర్వహించారని కొనియాడారు. రాష్ట్రానికి 20 లక్షల ఉద్యోగాలు తీసుకురావాలనే లక్ష్యంతో లోకేష్ కృషి చేస్తున్నారని చంద్రబాబు తెలిపారు. ప్రపంచ ప్రఖ్యాత సంస్థలు ఏపీకి రావడానికి లోకేష్ కృషే కారణమని పేర్కొన్నారు. ఆయన సామర్థ్యాన్ని గుర్తించి వర్కింగ్ ప్రెసిడెంట్ బాధ్యతలు అప్పగించామని చెప్పారు. అది పదవి కాదని, అత్యున్నత బాధ్యత అని స్పష్టం చేశారు. ప్రతి పోలింగ్ బూత్ స్థాయిలో టీడీపీ బలం పెరగాలని, 2024 ఎన్నికల్లో వచ్చిన ఓట్లకంటే మరింత ఎక్కువ ఓట్లు సాధించాలని పిలుపునిచ్చారు. గతంలో కార్యకర్తలు ఎదుర్కొన్న కష్టాలు తనకు గుర్తున్నాయని అన్నారు టీడీపీ అధినేత చంద్రబాబు.. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి క్లిష్టంగా ఉన్నప్పటికీ కేంద్ర సహకారంతో గట్టెక్కిస్తున్నామని చంద్రబాబు తెలిపారు. ఒక్కో అడుగు ముందుకు వేస్తూ



వ్యవస్థలను గాడిలో పెడుతున్నామని అన్నారు. నిలిచిపోయిన కేంద్ర పథకాలను పునరుద్ధరించామని, అప్పులను రీషెడ్యూల్ చేస్తున్నామని చెప్పారు. సూపర్ సిక్స్ హామీలను అమలు చేస్తున్నామని, ప్రజలకు వాట్సాప్ సేవలు అందిస్తున్నామని తెలిపారు. గూగుల్ క్లౌడ్ ఏఐ డేటా సెంటర్ సహా పలు ఐటీ సంస్థలను తీసుకువచ్చి విశాఖపట్నాన్ని టెక్ నగరంగా తీర్చిదిద్దుతామని చెప్పారు.

ప్రత్యర్థి పార్టీపై కూడా చంద్రబాబు తీవ్ర విమర్శలు చేశారు. అధికారంలో ఉన్నప్పుడు రాష్ట్రాన్ని నాశనం చేశారని, ఇప్పుడు కూడా కుట్రలు చేస్తున్నారని ఆరోపించారు. ప్రభుత్వానికి నిధులు వస్తుంటే వాటిని అడ్డుకునే ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు. ఫేక్ ప్రచారంతో ప్రజల్లో అనుమానాలు కలిగించడంలో ప్రత్యర్థి పార్టీ ముందుంటుందని విమర్శించారు. అయితే ప్రజలు అన్నీ గమనిస్తున్నారని, కుట్రలకు ఇక కాలం చెల్లిందని స్పష్టం చేశారు.

## తెలుగుదేశం కార్యవర్గ ప్రమాణ కార్యక్రమం

ప్రత్యేకతగా నిలిచింది. టీడీపీ చరిత్రలో తొలిసారిగా మండల, క్లస్టర్ స్థాయి నేతలకు కూడా పొలిట్ బ్యూరోలో చోటు కల్పించడం విశేషంగా మారింది. 'కార్యకర్తే అధినేత' అనే నినాదాన్ని నిజం చేస్తూ, కష్టపడి పని చేసిన నాయకులకు కమిటీల్లో ప్రాధాన్యం ఇచ్చారు. 44 ఏళ్ల పార్టీ చరిత్రలో కూడా కొత్త ఉత్సాహం కనిపించేలా టీడీపీ హైకమాండ్ కమిటీలను నియమించింది. సీనియర్ నాయకుల అనుభవాన్ని, జూనియర్ నాయకుల దూకుడును సమపాళ్లలో కలిపి కమిటీలను రూపొందించారు. ఈ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారంలో వర్కింగ్ ప్రెసిడెంట్ నారా లోకేష్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. అలాగే మంగళగిరి క్లస్టర్ ఇన్చార్జ్ గుత్తికొండ ధనుంజయ్, గజపతినగరం మండల పార్టీ అధ్యక్షురాలు గంట్యాడ శ్రీదేవి కూడా హైలెట్‌గా నిలిచారు. గతంలో సోషల్ మీడియాలో చురుకుగా పని చేసిన పలువురికి కూడా కొత్త కమిటీల్లో అవకాశం ఇవ్వడం గమనార్హం. ఎన్టీఆర్, చంద్రబాబు అధ్యక్షులుగా ఉన్న కాలంలోలాగే, ఈసారి కూడా సీనియర్ నేతలు యనమల రామకృష్ణుడు, గోరంట్ల బుచ్చయ్య చౌదరి కీలక బాధ్యతల్లో కొనసాగు తున్నారు. ఈ కొత్త కార్యవర్గంతో టీడీపీకి మరింత బలం చేకూరుతుందని పార్టీ వర్గాలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నాయి.

## ప్రజారోగ్య సంరక్షణ కోసం వినూత్న పథకం

అమరావతి, భీమోదయం: రోగాల ముందస్తు నివారణ చర్యలకు ప్రాధాన్యతనిస్తూ వ్యక్తుల ప్రస్తుత ఆరోగ్య పరిస్థితిని అంచనా వేసేందుకు సమగ్ర వైద్య పరీక్షలు చేపడతామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఇచ్చిన హామీ అమలు దిశగా వైద్యారోగ్య శాఖ ప్రధాన నిర్ణయాన్ని తీసుకుంది. 104 సంచార వైద్య వాహనాల ద్వారా సాలీనా రూ.162.72 కోట్ల వ్యయంతో గుర్తించిన ప్రతి వ్యక్తికీ 47 రకాల వైద్య పరీక్షలు చేపట్టే పథకానికి వైద్యారోగ్య శాఖా మంత్రి సత్యకుమార్ యాదవ్ బుధవారం ఆమోదం తెలిపారు. ఎన్‌సిడి సర్వేలో వివిధ జబ్బులపాలైన లేదా అవకాశమున్న వారిగా గుర్తించిన వారితో పాటు సంక్షేమ విద్యా వసతి గృహాల్లో ఉంటున్న విద్యార్థులతో కలిపి ఏడాదికి 56,40,000 మందికి ఒక్కొక్కరికీ 47 రకాల పరీక్షలు చేస్తారు.

జబ్బులకు గురైన వారికి చికిత్స అందిస్తున్న ప్రస్తుత విధానానికి భిన్నంగా పౌరుల ప్రస్తుత సమగ్ర ఆరోగ్య పరిస్థితిని వివిధ పరీక్షల ద్వారా మదింపు చేసి తద్వారా రోగాలను నివారించే దిశగా తగు చర్యలు చేపట్టాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పలు సందర్భాల్లో వైద్యారోగ్య శాఖను ఆదేశించారు. ఈమేరకు విస్తృత చర్చలనంతరం 104 వాహనాల ద్వారా అమలుకానున్న పౌరుల ఆరోగ్య తనిఖీ(సిటిజన్ హెల్త్ స్క్రీనింగ్) పథకానికి మంత్రి ఆమోదం తెలిపారు.

# డిసెంబర్ నాటికి అన్ని ప్రభుత్వ సేవలూ ఆన్‌లైన్

పై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామని సీఎం కు తెలిపారు. ఇప్పటి వరకూ 24 లక్షల మందికి పైగా వాట్సప్ గవర్నెన్సు సేవలు ఎలా పొందాలో అవగాహన కల్పించామని చెప్పారు. కర్నూలు జిల్లాలో ఏర్పాటు చేస్తున్న డ్రోన్ సిటీ ఫేజ్ 1 అభివృద్ధి పనులు శరవేగంగా సాగుతున్నాయని, ఇప్పటికే ప్లాంట్లు నెలకొల్పేందుకు ముందుకొచ్చిన 8 కంపెనీలకు భూముల కేటాయింపు పూర్తయ్యిందని, మే నెల రెండో వారంలో ఇవన్నీ గ్రౌండ్ అవుతాయని అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. డ్రోన్ సిటీ మాస్టర్ ప్లాన్ ఖరారయ్యిందని అధికారులు ఇచ్చిన వివరణ పై స్పందించిన సీఎం ఈ ఏడాది జూలై నాటికి మొదటి దశ పనులు పూర్తి చేయాలని స్పష్టం చేశారు.

**సీసీ కెమేరాలతో నేర నియంత్రణ చర్యలు..**

దేశంలో మరే రాష్ట్రంలోనూ లేనంతగా ఆంధ్రప్రదేశ్‌లో సీసీ టీవీ కెమేరాల ఏర్పాటు, వాటి వినియోగం, పర్యవేక్షణ జరుగుతోందని అధికారులు ముఖ్యమంత్రికి తెలిపారు. దీనివల్ల రాష్ట్రంలో నేరాల నియంత్రణ, నేరస్తులను గుర్తించడంతో పాటు మిస్సింగ్ కేసుల ట్రేసింగ్, వాహనాల దొంగతనాల వంటి కేసులు వేగంగా కొలిక్కి వస్తున్నాయని చెప్పారు. అయితే సీసీ కెమేరాలు లేని ప్రాంతాల్లో ప్రైవేట్ వ్యక్తులు ఏర్పాటు చేసిన సీసీ కెమేరాల డేటాను కూడా ఇంటిగ్రేట్ చేయాలని, ప్రజల్లో దీనిపై అవగాహన కల్పించాలని అధికారులకు ముఖ్యమంత్రి సూచించారు. సీసీ కెమేరాలతో పాటు శాటిలైట్ డేటాను వినియోగించు కునేలా కార్యాచరణ చేపట్టాలని అధికారుకు సీఎం నిర్దేశించారు. శాటిలైట్ సమాచారాన్ని ఆర్టీజీఎస్ కు అనుసంధానించి వేగంగా చర్యలు చేపట్టేలా చూడాలన్నారు.

ఇటీవల తిరుమల-తిరుపతి సమీపంలో శేషాచల అటవీ ప్రాంతంలో మంటలు వ్యాపించిన ఘటనపై వేగంగా స్పందించే అవకాశం ఉండేదన్నారు. డీజిల్, పెట్రోలు సరఫరా పై రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న తక్షణ చర్యలతో మళ్లీ సాధారణ స్థితికి నెలకొందని అయితే సమస్య ఉత్పన్నం కాకముందే రియల్ టైమ్‌లో స్పందించేలా చర్యలు ఉండాలని సీఎం సూచించారు

## జైళ్లశాఖ పాత్ర సమాజంలో కీలకం



హైదరాబాద్,ఏప్రిల్ 2 జైళ్ల శాఖ పాత్ర సమాజానికి అత్యంత ముఖ్యమని, ఇది సులభమైన పని కాదని డిజిపి శివధర్ రెడ్డి పేర్కొన్నారు. జైలు సేవ అనేది కేవలం నాలుగు గోడల మధ్య తాళాలు వేసే పని కాదని, అది ఖైదీలను సరిదిద్దుతూ సమాజంలో తిరిగి కలిపే బాధ్యత అని చెప్పారు. శిక్షణార్థులు క్రమశిక్షణ, నిష్పక్షపాతిత్వం మరియు వృత్తిపరమైన నైపుణ్యాలను పాటిస్తూ ఖైదీలను గౌరవంతో చూడాలని సూచించారు. వారికి తన శుభాకాంక్షలు తెలియజేశారు. ఢిల్లీ జైళ్ల సిబ్బందికి ప్రవేశ శిక్షణ కార్యక్రమాన్ని సికాలో తెలంగాణ డీజీపి శివధర్ రెడ్డి ప్రారంభించారు. ప్రాథమిక ప్రవేశ శిక్షణ కార్యక్రమాన్ని ఈరోజు చంచల్‌గూడలోని స్టేట్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ కరెక్షనల్ అడ్మినిస్ట్రేషన్ (సికా)లో ప్రారంభించారు. శిక్షణ కార్యక్రమం రాష్ట్రాల మధ్య సమన్వయం మరియు సంస్కరణ పరిపాలనలో పరస్పర సహకారానికి ప్రతీకగా నిలుస్తోంది. 2026 సంవత్సరంలో మొత్తం 381 మంది ఢిల్లీ జైళ్ల సిబ్బంది దశలవారీగా శిక్షణకు ఎంపికయ్యారు. నేడు ప్రారంభమైన మొదటి దశలో 62 మంది శిక్షణార్థులు పాల్గొంటున్నారు. వీరిలో 61 మంది ఢిల్లీ జైళ్ల శాఖకు చెందినవారు, 1 తెలంగాణ జైళ్ల శాఖ వార్డర్ ఉన్నారు. ఇది అంతర్రాష్ట్ర సహకారాన్ని మరింత బలోపేతం చేస్తుందన్నారు. తొమ్మిది నెలల సమగ్ర శిక్షణ కార్యక్రమం శిక్షణార్థుల్లో వృత్తిపరమైన నైపుణ్యం, క్రమశిక్షణ మరియు మానవతా దృక్పథాన్ని పెంపొందించేలా రూపొందించబడింది. ఈ కార్యక్రమంలో భాగంగా అంతర్గత శిక్షణ, జైలు నియమాలు, క్రిమినాలజీ, విక్టిమాలజీ / పెనాలజీ, సైకాలజీ, సోషియాలజీ / సోషల్ వర్క్, క్రిమినల్ చట్టాలు, బాహ్య శిక్షణ శారీరక వ్యాయామం, బిపిఆర్ / డి ప్రమాణాల ప్రకారం పరేడ్, యోగా / ధ్యానం తదితర అంశాలపై శిక్షణ ఇస్తారు. శిక్షణార్థులు సికా ఆధునిక సదుపాయాలను వినియోగించుకోనున్నారు.

## రాష్ట్రంలో పర్యాటక రంగానికి కొత్త కళ



జూపల్లి కృష్ణారావు చర్చించారు. హైదరాబాద్‌లో భారీ స్థాయిలో కార్నివాల్ నిర్వహణకు ప్రతిపాద నలు సిద్ధం చేయాలని అధికారులకు స్పష్టం చేశారు. ఈ ఏడాది చివరిలో నవంబర్ లేదా డిసెంబర్‌లో వీటిని నిర్వహించేందుకు ప్లాన్ చేయాలని సూచించారు. రాష్ట్రంలోని కీలక పర్యాటక కేంద్రాల్లో వారాంతంలో సాంస్కృతిక ప్రదర్శనలు నిర్వహించాలని తెలిపారు. సోమశిల, రామప్ప, యాదాద్రి ప్రాంతాల్లో చేపట్టిన అభివృద్ధి పనులు వేగవంతం చేయాలని అధికారులకు స్పష్టం చేశారు. గోల్కొండ, తారామతి బరాదరిలలో జరుగుతున్న పనులపై ఈ సందర్భంగా మంత్రి జూపల్లి కృష్ణారావు సమీక్షించారు. పర్యాటక ప్రాంతాల్లో కనీస సౌకర్యాల ఏర్పాట్లపై రాజీ లేకుండా పనులు చేపట్టాలని ఆదేశించారు. మరుగుదొడ్లు, టెంట్లు, గ్లాస్ హౌస్‌లు ఏర్పాటు చేయాలని అధికారులకు మంత్రి జూపల్లి స్పష్టం చేశారు. రహదారి పక్కన విశ్రాంతి కేంద్రాలు అభివృద్ధి చేయాలని పేర్కొన్నారు. ప్రతి టూరిజం ప్రాజెక్ట్‌కు నోడల్ అధికారులను నియమించాలన్నారు. జీహెచ్ఎంసీ, హెచ్ఎండీఏ సమన్వయంతో నగరాన్ని సుందరీకరిస్తామని తెలిపారు. స్కైవాక్‌లు, శిల్పాలతో హైదరాబాద్‌కు కొత్త ఆకర్షణ తీసుకు వచ్చేందుకు కృషి చేస్తామని చెప్పారు‚÷లంగాణను వెడ్డింగ్ డెస్టినేషన్‌గా తీర్చిదిద్దుతామని మంత్రి జూపల్లి పేర్కొన్నారు. మెడికల్, వెల్నెస్, గోల్ఫ్, ఫిలిం టూరిజంపై ప్రత్యేక దృష్టి సారిస్తామని తెలిపారు. మధ్య ప్రాచ్య దేశాల్లో తెలంగాణ టూరిజంపై ప్రచారం నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటామని వివరించారు. చైనా, వియత్నాం టూరిజం మోడళ్ల గురించి అధ్యయన యాత్రలపై ప్రతిపాదనలు వచ్చాయని తెలిపారు. వరంగల్, సోమశిలలో త్రీ స్టార్, ఫైవ్ స్టార్ హోటళ్ల ప్రతిపాదనలు వచ్చాయని మంత్రి జూపల్లి చెప్పారు. రామప్ప దేవాలయం వరకు ప్రత్యేక బస్సు సర్వీసులు నడపాలని అధికారులను ఆదేశించారు. పర్యాటక ప్రాజెక్టులకు నిర్దిష్ట కాలపరిమితితో కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేయాలని అధికారులకు మంత్రి జూపల్లి కృష్ణారావు సూచించారు.

## తెలంగాణ టెన్త్ ఫలితాలు విడుదల




హైదరాబాద్,ఏప్రిల్29 తెలంగాణ పదో తరగతి పరీక్ష ఫలితాలు విడుదలయ్యాయి. బుధవారం మధ్యాహ్నం ప్రభుత్వ సలహాదారు కే.కేశవరావు ఫలితాలను విడుదల చేశారు. మొత్తం 95.1 శాతం విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. ఈ ఏడాది 5 లక్షల 28 వేలకు పైగా విద్యార్థులు పదో తరగతి పరీక్షలు రాశారు. టెన్త్ ఫలితాల్లో బాలికలదే పైచేయిగా నిలిచింది. బాలికలు 96.26 శాతం ఉత్తీర్ణత సాధించగా.. బాలురు 94.07 శాతం ఉత్తీర్ణత పొందారు. 5,731 స్కూళ్లలో వంద శాతం ఉత్తీర్ణత నమోదవగా.. 6 పాఠశాలల్లో సున్నా శాతం ఉత్తీర్ణత నమోదైనట్లు విద్యాశాఖ వెల్లడించింది. పదో తరగతి ఫలితాలను 8096958096 అనే మీ సేవా వాట్సాప్ ద్వారా తెలుసుకోవచ్చు. మీ సేవా వాట్సాప్ నెంబర్‌కు విద్యార్థులు హాయ్ అని మెసేజ్ టైప్ చేయాలి. తర్వాత ఎస్ఎస్సి రిజల్ట్స్ అని టైప్ చేసి హాల్ టికెట్ నెంబర్‌ను ఎంటర్ చేస్తే ఫలితాలను చూడొచ్చు. ఇకపోతే సాంఘిక సంక్షేమ గురుకులాల్లో 99.10 శాతం ఉత్తీర్ణత సాధించారు. తెలుగు మీడియం విద్యార్థుల్లో 89.14 శాతం ఉత్తీర్ణత నమోదయ్యింది. ఇంగ్లీష్ మీడియం విద్యార్థుల్లో 95.86 శాతం ఉత్తీర్ణత నమోదయ్యింది. ఉర్దూ మీడియం విద్యార్థుల్లో 86.71 శాతం నమోదయ్యింది. ములుగు జిల్లాలో అత్యధికంగా 99.30 శాతం ఉత్తీర్ణత సాధించారు. హైదరాబాద్ జిల్లాలో అత్యల్పంగా 89.23 శాతం ఉత్తీర్ణత నమోదయ్యింది. గ్రేడ్స్ మాత్రమే కాకుండా స్జబెక్టుల వారీగా మార్కులను వెల్లడించారు.

## చంద్రబాబుకు బిజినెస్ రిఫార్మర్ అవార్డు

- టీమ్ స్పిరిట్ వల్లనే రాష్ట్రానికి పెట్టుబడులు
- మంత్రులు, అధికారులకు నేడు బాబు విందు

అమరావతి,ఏప్రిల్ 29 ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు బిజినెస్ రిఫార్మర్ ఆఫ్ ది ఇయర్-2025 అవార్డును అందుకున్న నేపథ్యంలో కేబినెట్ మంత్రులు, ప్రభుత్వంలోని పలు శాఖల కార్యదర్శులు, వివిధ విభాగాల అధిపతుల(హెచ్ఓడీ)కు సీఎం చంద్రబాబు విందు ఇవ్వనున్నారు. గురువారం రాత్రి సీఆర్డీఏ కార్యాలయంలో వీరందరికి సీఎం చంద్రబాబు విందు ఇవ్వనున్నారు. తనకు వచ్చిన ఈ అవార్డు రాష్ట్రానికి, ప్రభుత్వానికి వచ్చిన గుర్తింపు అని సీఎం చంద్రబాబు ఇప్పటికే ప్రకటించిన సంగతి తెలిసిందే. టీమ్ ఏపీ స్పిరిట్‌తో పని చేయడం వల్లే.. అందరి సహకారం, భాగస్వామ్యంతో ఈ అవార్డు వచ్చిందని సీఎం చంద్రబాబు వివరించారు. ఈ నేపథ్యంలో మంత్రులు, అధికారులను మోటివేట్ చేసేందుకు, వారి సహకారానికి ధన్యవాదాలు తెలిపేందుకు వారిని ఈ డిన్నర్‌కు ఏపీ సీఎం ఆహ్వానించారు. డిన్నర్ విత్ విన్నర్స్ పేరుతో మంత్రులు, సెక్రటరీలు, హెచ్‌వోడీలకు ఇప్పటికే సీఎం చంద్రబాబు పేరుతో ఆహ్వానాలు వెళ్లాయి. ÷ుజధాని అమరావతిలోని సీఆర్డీఏ కార్యాలయంలో గురువారం రాత్రి 7 నుంచి 9 గంటల వరకు సమావేశం ఏర్పాటు చేయనున్నారు. ఈ సమావేశంలో అధికారం చేపట్టిన ఈ 22 నెలల్లో సాధించిన విజయాలు.. రానున్న 38 నెలల్లో నిర్దేశిరచుకున్న లక్ష్యాలపై అధికారులతో చర్చించి ఉత్సాహపరిచేందుకు ఈ కార్యక్రమాన్ని రూపొందించారు. తనకు వచ్చిన అవార్డు రాష్ట్రానికి మరిన్ని పెట్టుబడులు తీసుకు రావడానికి, బ్రాండ్ క్రియేట్ చేయడానికి దోహద పడాలనే ఆలోచనలో సీఎం చంద్రబాబు ఉన్నారు. ఈ క్రమంలో ప్రభుత్వంలో కీలక భాగస్వాములను ఆహ్వానించి కార్యోన్ముఖులను చేసేందుకు ఈ విందు సమావేశాన్ని సీఎం చంద్రబాబు ఏర్పాటు చేసినట్లు తెలుస్తోంది.

# దేశంలో ఎప్పుడు ఎన్నికలు జరిగినా కాంగ్రెస్‌దే విజయం

నిజామాబాద్,ఏప్రిల్ 29 కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ చేతుల మీదుగా నిజామాబాద్ జిల్లా పార్టీ కార్యాలయాన్ని ప్రారంభిస్తామని పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ తెలిపారు. బుధవారం ఉదయం నిజామాబాద్‌లో నూతన కాంగ్రెస్ కార్యాలయ భవనానికి మహేశ్ గౌడ్, జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి సీతక్క భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా పీసీసీ చీఫ్ మాట్లాడుతూ.. ప్రధాని పదవిని కూడా రాహుల్ గాంధీ త్యాగం చేశారని.. దేశం మొత్తం ఆయనవైపు చూస్తోందన్నారు. దేశంలో ఎప్పుడు ఎన్నికలు జరిగినా కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. బీజేపీ.. కుల, మతాల చిచ్చు రేపుతోందని మహేశ్ విమర్శించారు. వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి వంద సీట్లు రావటం ఖాయమన్నారు. ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని నెరవేరుస్తామని తెలిపారు. కేసీఆర్ పాలన తెలంగాణను 50 ఏళ్లు వెనక్కి తీసుకెళ్లిందని మహేశ్ విమర్శించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీకి మరో పార్టీ పోటీ లేదన్నారు. మంచి నమూనాతో రాష్ట్ర వ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీ కార్యాలయాలు ఏర్పాటు చేస్తామని తెలిపారు. అభివృద్ధి విషయంలో ఎక్కడా వెనక్కి తగ్గేది లేదని మహేశ్ కుమార్ స్పష్టం చేశారు. రెండున్నరేళ్లలో కాంగ్రెస్ పార్టీ ఎంతో అభివృద్ధి చేసిందని.. ఏడాది కాలంలో 4 లక్షల ఇండ్లు కట్టించి ఇచ్చామని మంత్రి సీతక్క వెల్లడించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు సుదర్శన్ రెడ్డి, షబ్బీర్ అలీ, ఎమ్మెల్యే భూపతి రెడ్డి పాల్గొన్నారు.

# తృణమూల్, బీజేపీ మధ్య గట్టి పోరు

**తమిళనాడులో మళ్లీ డీఎంకేదే అధికారం**
**కేరళలో అధికార ఎల్డీఎఫ్‌కు ఎదురుగాలి**
**అస్సాం, పుదుచ్చేరి మళ్లీ కమలం సొంతం**
**ఎగ్జిట్ పోల్స్ అంచనాలు**
**మే 4న ఓట్ల లెక్కింపు**

న్యూఢిల్లీ, ఏప్రిల్ 29: నాలుగు రాష్ట్రాలు, ఒక కేంద్ర పాలిత ప్రాంతంలో జరిగిన అసెంబ్లీ ఎన్నికల ఎగ్జిట్ పోల్స్ ఫలితాలు బుధవారం సాయంత్రం వెలువడ్డాయి. కేరళ, తమిళనాడు, పశ్చిమ బెంగాల్, అస్సాం, పుదుచ్చేరి అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించిన ఎగ్జిట్ పోల్స్ మిశ్రమ, నిర్ణయాత్మక ఫలితాలను అంచనా వేశాయి. తమిళనాడులో డీఎంకే విజయ దుందుభి మోగించి మరోసారి అధికారాన్ని చేపట్టనున్నట్లు అనేక సంస్థలకు చెందిన ఎగ్జిట్ పోల్స్ అంచనా వేయగా పశ్చిమ బెంగాల్‌లో అధికార టీఎంసీ, బీజేపీ మధ్య హోరాహోరీ పోరు నెలకొన్నట్లు అంచనాలు సూచించాయి

కేరళలో సీపీఎం సారథ్యంలోని ఎల్‌డీఎఫ్ అధికారాన్ని కోల్పోయి కాంగ్రెస్ నేతృత్వంలోని యూడీఎఫ్ అధికారంలోకి రానున్నట్లు ఎగ్జిట్ పోల్స్ అంచనా వేశాయి. అస్సాంలో బీజేపీ అధికారాన్ని నిలబెట్టుకుంటుండగా పుదుచ్చేరిలో సైతం బీజేపీ సారథ్యంలోని కూటమే విజయం సాధించనున్నట్లు ఎగ్జిట్ పోల్స్ అంచనాలు చెబుతున్నాయి.

బెంగాల్‌లో హోరాహోరీ
పశ్చిమ బెంగాల్‌లో అధికార టీఎంసీ, బీజేపీ మధ్య హోరాహోరీ పోరు ఏర్పడినట్లు ఎగ్జిట్ పోల్స్ ఫలితాలు సూచిస్తున్నాయి. మెజారిటీ ఎగ్జిట్ పోల్స్ సర్వేలు బీజేపీకే విజయావకాశాలు అధికంగా ఉన్నట్లు అంచనా వేయగా పీపుల్స్ పల్స్, పోల్ ఆఫ్ ఎగ్జిట్ పోల్స్ సర్వేలు మాత్రం మమతా బెనర్జీ నేతృత్వంలోని టీఎంసీ మరోసారి అధికార పీఠాన్ని దక్కించుకోనున్నట్లు అంచనా వేశాయి.

మూడో స్థానానికి టీవీకే
తమిళనాడులో అధికార డీఎంకే వరుసగా రెండవ సారి అధికారాన్ని చేపట్టనున్నట్లు అనేక సర్వే సంస్థలు అంచనా వేశాయి. బీజేపీతో చేతులు కలిపి బరిలోకి దిగిన అన్నాడీఎంకేకు మరోసారి ఓటమి తప్పదని సర్వేలు పేర్కొన్నారు. రాజకీయ అరంగేట్రం చేసి తొలిసారి ఎన్నికల పోరులో పాల్గొన్న సినీనటుడు విజయ్ సారథ్యంలోని టీవీకేకి రెండంకెల సీట్లు దక్కే అవకాశం ఉన్నట్లు సర్వేలు అంచనా వేశాయి.

కేరళలో ఎల్‌డీఎఫ్ ఔట్?
కేరళలో అధికార ఎల్‌డీఎఫ్‌కు ఎదురుదెబ్బ తగలనున్నట్లు ఎగ్జిట్‌పోల్స్ అంచనా వేశాయి. విజయన్ నేతృత్వంలో రెండుసార్లు అధికారంలోకి వచ్చిన ఎల్‌డీఎఫ్‌కు ఈసారి పరాజయం తప్పేలా లేదని సూచించాయి. కాంగ్రెస్ సారథ్యంలోని యూడీఎఫ్‌కు ఈ దఫా ఓటర్లు పట్టం కట్టినట్లు




అంచనాలు తేల్చాయి.

అస్సాంలో మళ్లీ బీజేపీ
అస్సాంలో బీజేపీ హ్యాట్రిక్ విజయం సాధించనున్నట్లు సర్వే సంస్థలు అంచనా వేశాయి. బీజేపీ కూటమికి 88-100 స్థానాలు, కాంగ్రెస్ కూటమికి 24-36 స్థానాలు దక్కవచ్చని యాక్సిస్ మై ఇండియా అంచనా వేసింది. పీపుల్స్ పల్స్ సర్వే ప్రకారం బీజేపీ కూటమికి 68-72, కాంగ్రెస్ కూటమికి 22-26 సీట్లు దక్కవచ్చని అంచనా.

పుదుచ్చేరిలో మళ్లీ బీజేపీ కూటమి
పుదచ్చేరిలో బీజేపీ కూటమికే విజయావకాశాలు ఉన్నట్లు సర్వేలు అంచనా వేశాయి. ఎగ్జిట్ పోల్స్ అంచనాలు ఎలా ఉన్నప్పటికీ మే 4న వెలువడే తుది ఫలితాలు పార్టీలు, అభ్యర్థుల తలరాతను నిర్ణయించనున్నాయి.

# కంచికచర్లలో అగ్నిమాపక శాఖ ఆధ్వర్యంలో చలివేంద్రం ఏర్పాటు



ఐ ఎన్ బి టైమ్స్ కంచికచర్ల, ఏప్రిల్ 29:మండు వేసవిలో ప్రజల దాహార్తిని తీర్చేందుకు కంచికచర్ల అగ్నిమాపక కేంద్రం వినూత్న కార్యక్రమం చేపట్టింది. కంచికచర్ల పట్టణంలోని భావన థియేటర్స్ సెంటర్ నందు మంగళవారం చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు.ఈ కార్యక్రమాన్ని స్టేషన్ ఫైర్ ఆఫీసర్ఏ.శివారెడ్డిప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ "వేసవి తాపం ఎక్కువగా ఉంది. బాటసారులు, ఆటో డ్రైవర్లు, ప్రయాణికులు దాహంతో ఇబ్బంది పడకుండా ఉండేందుకు ఈ చలివేంద్రం ఏర్పాటు చేశాం. మజ్జిగ, చల్లని నీటిని అందిస్తున్నాం" అని తెలిపారు.ఈ కార్యక్రమంలో అగ్నిమాపక సిబ్బంది, స్థానిక ప్రజలు, వ్యాపారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. చలివేంద్రం ఏర్పాటు చేయడంపై ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. వేసవి కాలం అంతా ఈ సేవలు కొనసాగిస్తామని ఎస్ఎఫ్ఓ శివారెడ్డి తెలిపారు.
ప్రజలకు సేవ చేయడమే లక్ష్యంగా అగ్నిమాపక శాఖ చేపట్టిన ఈ కార్యక్రమాన్ని పలువురు అభినందించారు.

# కలత్తూరు ఎస్ టీ కాలనీలో పౌరహక్కుల దినోత్సవం

**-- సమస్యల మధ్య అవగాహన కార్యక్రమం**



ఐ ఎన్ బి టైమ్స్ వరదయ్యపాలెం, ఏప్రిల్ 29: కలత్తూరు ఎస్ టీ కాలనీలో పౌరహక్కుల దినోత్సవాన్ని నిర్వహించారు. గ్రామానికి ప్రాథమిక సౌకర్యాలు లేకపోవడం ఈ కార్యక్రమంలో ప్రధానంగా చర్చనీయాంశమైంది. ముఖ్యంగా అత్యవసర సేవ అయిన 108 అంబులెన్స్ కూడా చేరలేని దుస్థితిలో ఉన్న రోడ్డు పరిస్థితిపై గిరిజనులు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా గ్రామ ప్రజలు మాట్లాడుతూ, రోడ్డు సౌకర్యం లేకపోవడం వల్ల వైద్య సేవలు అందక ప్రాణాపాయం ఏర్పడే పరిస్థితులు వస్తున్నాయని వాపోయారు. అలాగే త్రాగునీటి సమస్య కూడా తీవ్రంగా ఉందని పేర్కొంటూ, తక్షణమే రోడ్డు మరియు త్రాగునీటి సౌకర్యాలు కల్పించాలని అధికారులను కోరారు. వరదయ్యపాలెం తహసీల్దార్ సుధీర్ అధ్యక్షతన, డీవీఎంసీ మెంబర్ గుత్తి త్యాగరాజు సమక్షంలో జరిగిన ఈ కార్యక్రమంలో పౌరహక్కులపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. ప్రభుత్వ పథకాలు, హక్కులు, సమస్యల పరిష్కార మార్గాలపై అధికారుల ద్వారా వివరాలు అందించారు.విద్యుత్ తీగలు ఎత్తుకు అమర్చాలని కోరారు. ఈ కార్యక్రమానికి పోలీస్, ఆర్‌డబ్ల్యూఎస్, వెలుగు, ఉపాధి హామీ, గృహ నిర్మాణ, ఇంజినీరింగ్ అసిస్టెంట్, సాంఘిక సంక్షేమ శాఖలకు చెందిన అధికారులు హాజరయ్యారు. అయితే పంచాయతీ, విద్యుత్ శాఖ అధికారులు గైర్హాజరు కావడం గమనార్హం. గ్రామ సమస్యలను తక్షణమే పరిష్కరించాలని గిరిజనులు అధికారులను మరోసారి విజ్ఞప్తి చేశారు. పౌరహక్కుల దినోత్సవం సందర్భంగా జరిగిన ఈ కార్యక్రమం గ్రామ ప్రజల్లో అవగాహన పెంచినా, మౌలిక సదుపాయాల లోపం మాత్రం స్పష్టంగా బయటపడింది.

# టెన్త్ రిజల్ట్స్... 95.15% ఉత్తీర్ణత..

**ఎస్సెస్సీ బోర్డు చరిత్రలోనే రికార్డ్ ఫలితాలు**




- ఫలితాల్లో బాలుర కంటే బాలికలదే పైచేయి
- ములుగు జిల్లా టాప్.. హైదరాబాద్ లాస్ట్
- జూన్ 5 నుంచి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ

హైదరాబాద్, ఏప్రిల్ 29 (నమస్తే తెలంగాణ) : రాష్ట్రంలో ఈసారి పదో తరగతి వార్షిక పరీక్ష ఫలితాల్లో రికార్డ్ స్థాయి ఉత్తీర్ణతా శాతం నమోదైంది. అత్యధికంగా 95.15 శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. రాష్ట్రవ్యాప్తంగా 5,26,166 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా, 4,97,312 మంది ఉత్తీర్ణులయ్యారు. నిరుటితో పోల్చితే ఈ ఏడాది 3శాతం మంది విద్యార్థులు అధికంగా ఉత్తీర్ణత సాధించడం విశేషం. హైదరాబాద్ బషీర్‌బాగ్‌లోని ఎస్సీఈఆర్టీ కార్యాలయంలో ప్రభుత్వ సలహాదారు కే కేశవరావు, విద్యాశాఖ కార్యదర్శి డాక్టర్ యోగితారాణా, పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ డాక్టర్ నవీన్ నికోలస్ బుధవారం పదో తరగతి వార్షిక పరీక్షల ఫలితాలను విడుదల చేశారు. ఈ ఫలితాల్లో ములుగు జిల్లా 99.30%తో ముందంజలో ఉండగా, 89.23%తో హైదరాబాద్ జిల్లా చివరి స్థానంలో నిలిచింది. నిరుడు 92.78% ఉత్తీర్ణత నమోదైతే, ఈసారి 95.15%తో ఎస్సెస్సీ బోర్డు చరిత్రలోనే రికార్డుస్థాయి ఉత్తీర్ణత నమోదైంది. కొవిడ్ కాలంలో పరీక్షలు నిర్వహించకుండా విద్యార్థులందరినీ ఉత్తీర్ణులను చేయడంతో అప్పుడు 100% ఉత్తీర్ణత నమోదైంది. ఆ ఫలితాలను మినహాయిస్తే ఎస్సెస్సీ బోర్డు చరిత్రలోనే ఈ విద్యాసంవత్సరంలో అత్యధికంగా విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారు. ప్రభుత్వ పరీక్షల విభాగం డైరెక్టర్ పీవీ శ్రీహరి, ఎస్సీఈఆర్టీ డైరెక్టర్ జీ రమేశ్ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు

బాలికలదే పైచేయి
పదో తరగతి ఫలితాల్లో ఈసారి కూడా బాలికలే సత్తాచాటారు. ఈసారి 96.26% మంది బాలికలు ఉత్తీర్ణత సాధించగా, 94.07% మంది బాలురు పాసయ్యారు. అబ్బాయిలతో పోల్చితే అమ్మాయిలు 2.19% అధికంగా ఉత్తీర్ణులయ్యారు. నిరుడు బాలికలు 94.26%, బాలురు 91.32% చొప్పున ఉత్తీర్ణత సాధించారు. జిల్లాల వారీగా తీసుకుంటే ములుగు జిల్లా 99.30%తో అన్ని జిల్లాల కంటే అత్యధిక ఉత్తీర్ణత సాధించి రాష్ట్రంలోనే మొదటిస్థానంలో నిలిచింది. ఆ తర్వాత 99.03%తో నాగర్‌కర్నూల్, 98.96%తో నిర్మల్ జిల్లాలు వరుసగా ద్వితీయ, తృతీయ స్థానాలను దక్కించుకున్నాయి. హైదరాబాద్ జిల్లా 89.23శాతంతో చివరిస్థానంలో నిలిచింది. ఈసారి పదో తరగతి మెమోలపై మార్కులతోపాటు గ్రేడ్లను సైతం ముద్రించారు. సబ్జెక్టుల వారీగా ఇంటర్నల్ మార్కులు, థియరీ పరీక్షల్లో వచ్చిన మార్కులను కలిపి ముద్రించారు. మొత్తం మార్కులను మాత్రం ముద్రించలేదు. మార్కులేకాకుండా సీజీపీఏ గ్రేడ్లను సైతం కేటాయించారు.

# తెలంగాణ రాష్ట్ర పదవ తరగతి ఫలితాల్లో వి.వి.ఎన్ భాష్యం ప్రభంజనం




ఐ ఎన్ బి టైమ్స్ కూకట్ పల్లి ప్రతినిధి, ఏప్రిల్ 29
శేరిలింగంపల్లి నియోజకవర్గం వివేకానంద్ నగర్‌లోని వి.వి.ఎన్ భాష్యం విద్యాసంస్థ పదవ తరగతి ఫలితాల్లో మరోసారి తన ప్రతిభను చాటుకుంది. ప్రతి ఏడాది మెరుగైన ఫలితాలతో ముందుకు సాగుతున్న ఈ సంస్థ, ఈసారి కూడా అద్భుత విజయాన్ని నమోదు చేసింది. ఈ ఏడాది ఫలితాల్లో పి. శృతి, ధర్ గుణ సాయి శరణ్ విద్యార్థులు 595 మార్కులు సాధించి అత్యుత్తమ ప్రతిభ కనబర్చారు. వీరి తరువాత ఖ. హనీష, ఖ. అనురాధ 594 మార్కులు, ఎం. జోస్ 592 మార్కులు సాధించారు. అలాగే బి. రోహన్ ఆనంద్, ఎన్.. మౌనిక, ఎ. (విద్యార్థి) 591 మార్కులు, జ్ఞానశ్రీ, ఎ. శ్రీజతిన్ 590 మార్కులు సాధించి విశేష ప్రతిభ కనబర్చారు. ఫలితాల గణాంకాలను పరిశీలిస్తే, 590 పైగా మార్కులు సాధించిన విద్యార్థులు 10 మంది ఉన్నారు. 580 పైగా మార్కులు సాధించిన వారు 45 మంది, 570 పైగా మార్కులు సాధించిన వారు 94 మంది, 550 పైగా మార్కులు సాధించిన వారు 180 మంది, 500 పైగా మార్కులు సాధించిన వారు 321 మంది ఉన్నారు. విద్యార్థుల కృషి, ఉపాధ్యాయుల అంకితభావం, తల్లిదండ్రుల ప్రోత్సాహం వల్లే ఈ విజయాన్ని సాధించగలిగామని పాఠశాల యాజమాన్యం తెలిపింది. వి.వి.ఎన్ భాష్యం విద్యాసంస్థ ఈ ఫలితాలతో మరోసారి విద్యా రంగంలో తన ప్రత్యేకతను నిలబెట్టుకుంది.

# వరదయ్యపాలెం మండలం చిలముత్తూర్ లో దాహం దాహం

**ఎంపీడీఓ కు నీటి సమస్య గురించి వారం రోజులు ముందు అర్జీ ఇచ్చి సమస్యను పరిష్కరించమని వివరించిన చలమత్తూర్ పంచాయతీ కమ్మ వీధికి చెందిన శ్రీరాములు నాయుడు**



ఐ ఎన్ బి టైమ్స్, చిలమత్తూరు ఏప్రిల్ 29: తిరుపతి జిల్లా, సత్యవేడు నియోజకవర్గం, వరదయ్యపాలెం మండలం, చిలమత్తూరు గ్రామం, కమ్మ వీధిలో నీటి సమస్యతో అల్లాడుతున్న గ్రామస్తులు గత ఐదు సంవత్సరాలుగా తాగునీరు లేక తాగడానికి నీళ్లు కోసం రెండు వీధుల అవతల నుండి మంచినీరు తెచ్చుకొని జీవనం సాగిస్తున్న అక్కడ ప్రజలు సమస్యని పరిష్కరించమని అధికారులకు విన్నవించుకున్న పట్టించుకోకుండా మా సమస్యను చెవిలో కూడా వేసుకోవడం లేదు అని అక్కడ గ్రామస్తులు తెలిపారు ఇంకనైనా సంబంధిత అధికారులు స్పందించి తాగునీటి సమస్యను పరిష్కరించాల్సిందిగా కోరారు ఈ విషయంపై స్పెషల్ ఆఫీసర్ ప్రసాద్ ను వివరణ కోరగా మా దృష్టికి సమాచారం వచ్చింది మేము రెండు రోజుల్లో బోరు వేసి పైపులైన్ దొర తాగునీటి సమస్యను పరిష్కరిస్తామని తెలిపారు...

# కూకట్పల్లి రామాలయంలో శ్రీ ఆంజనేయ స్వామి పాలాభిషేకంలో పాల్గొన్న కేటీఆర్



ఐ ఎన్ బి టైమ్స్ కూకట్పల్లి ప్రతినిధి, ఏప్రిల్ 29
బుధవారం సీతారామచంద్రస్వామి దేవస్థానం (కూకట్‌పల్లి రామాలయం)లో రామన్న, కృష్ణన్నతో కలిసి గరుద్మంతుడు మరియు హనుమంతునికి పవిత్రమైన పాలాభిషేకం నిర్వహించడం ఎంతో భక్తి పరవశమైన కార్యక్రమం.
పాలాభిషేకం ద్వారా భగవంతునికి మన భక్తిని, శరణాగతిని వ్యక్తపరుస్తాం. హనుమంతుడికి ప్రత్యేకంగా అభిషేకం చేయడం శక్తి, ధైర్యం, విజయాలను ప్రసాదిస్తుందని నమ్మకం.ఈ పుణ్య కార్యక్రమంలో పాల్గొన్న ప్రతి ఒక్కరికి శ్రీరాముని ఆశీస్సులు, ఆంజనేయ స్వామి కృప కలగాలని కోరుకున్నారు.

# పాత్ర కోసం రిస్క్‌కు వెనకాడని రష్మిక

పాత్ర కోసం ఎంత రిస్క్ అయినా తీసుకునే కథానాయికల్లో రష్మిక ముందు వరుసలో ఉంటారు. తాజాగా ఆమె మరోసారి నటనపై తనకున్న నిబద్ధతను చాటుకున్నారు. తాను నటిస్తోన్న 'మైసా' కోసం మునుపెన్నడూ లేనివిధంగా కష్టపడుతున్నారు. యదార్థ సంఘటనల ఆధారంగా రూపొందుతున్న ఈ చిత్రంలో రష్మిక గోండు తెగకు చెందిన మహిళగా కనిపించనున్నారు. ఈ సినిమా కోసం ఆమె చేసిన సవాలుతో కూడిన స్టంట్స్ గురించి 'మైసా' డైరెక్టర్ రవీంద్ర పుల్లె తాజాగా ఓ ఇంటర్వ్యూలో వెల్లడించారు. రష్మిక పోషిస్తున్న పాత్ర పేరు 'మైసా'. చాలా ప్రభావవంతమైన పాత్ర. ఆమె ప్రదర్శించే కోపం, ఆవేశం ఈ సినిమాకు హైలైట్. ఇటీవలే కేరళలోని అతిరపల్లి జలపాతం వద్ద ఒక క్లిష్టమైన యాక్షన్ సీన్ చిత్రీకరించాం. రష్మిక డూప్ లేకుండా 80 అడుగుల ఎత్తు నుంచి దూకారు. ఆ సమయంలో ఆమె చేతులకు, కాళ్లకు గాయాలయ్యాయి. అయినా విరామం తీసుకోకుండా షూటింగ్‌లో పాల్గొన్నారు. ఆమె నిబద్ధత చూసి చిత్రబృందమంతా ఆశ్చర్యపోయిందని తెలిపారు. ఈ చిత్రం కోసం అంతర్జాతీయ స్టంట్ కొరియోగ్రాఫర్ కెచా ఖంపక్డీ ఆధ్వర్యంలో రష్మిక శిక్షణ పొందినట్లు డైరెక్టర్ వెల్లడించారు. బ్యాంకాక్‌లో వారం రోజుల పాటు ప్రతిరోజూ 8 గంటల పాటు కఠినమైన యుద్ధ విద్యలను నేర్చుకున్నట్లు తెలిపారు. మార్షల్ ఆర్ట్స్, గిరిజన పోరాట పద్ధతులను కలిపి ఈ సినిమా కోసం ఓ కొత్తతరహా యాక్షన్ శైలిని డిజైన్ చేసినట్లు ఆయన పేర్కొన్నారు.




# వారణాసికి ప్రపంచ మార్కెట్





అగ్ర దర్శకుడు ఎస్.ఎస్.రాజమౌళి తన సినిమాలతో పాన్ ఇండియా సహా... మరెన్నో సరికొత్త మార్కెట్లకి దారి వేశారు. ఆ దారి తెలుగు సినిమాలకు గత కొన్నేళ్లుగా రాచబాటగా మారింది. 'బాహుబలి' సినిమాల తర్వాత జపాన్ సహా ఎన్నో దేశాల్లో తెలుగు సినిమాలపై ఆసక్తి పెరిగింది. ఇప్పుడు అదే తరహాలో మరిన్న దేశాల్లో వారణాసిని తీసుకెళ్లేలా దర్శకుడు రాజమౌళి ప్లాన్ వేస్తున్నారు. మార్కెట్‌ను పెంచుకోవడం లక్ష్యంగా ప్రణాళికలు వేస్తున్నారు. వారణాసి' సినిమాతో మరిన్ని కొత్త మార్కెట్లనీ కొల్లగొట్టాలనే ప్రణాళికల్ని ఆ చిత్రబృందం సిద్ధం చేసింది. ముఖ్యంగా దక్షిణ అమెరికాతోపాటు, లాటిన్ అమెరికా దేశాల మార్కెట్‌పైన గురిపెట్టినట్టు తెలుస్తోంది. 'వారణాసి' కథ కూడా పలు దేశాల్లో ముడిపడినది కావడం, కథానాయకుడు ప్రపంచాన్ని చుట్టే సాహసికుడు కావడంతో... మరిన్ని కొత్త దేశాలకు, కొత్త మార్కెట్లకీ ఈ సినిమాని తీసుకెళ్లాలనే ప్రణాళికలతో 'వారణాసి' బృందం ఉంది. అందులో భాగంగానే ఇటీవల మెక్సికోలో జరిగిన కామిక్ కాన్‌లో సినిమాని ప్రచారం చేశారు.

# యశ్ టాక్సిక్ విడుదల మరోమారు వాయిదా




కన్నడ రాకింగ్ స్టార్ యష్ హీరోగా, మోస్ట్ టాలెంటెడ్ డైరెక్టర్ గీతూ మోహన్‌దాస్ తెరకెక్కిస్తున్న హై-వోల్టేజ్ యాక్షన్ చిత్రం టాక్సిక్ మరోసారి వాయిదా పడింది. విడుదల తేదీపై అభిమానుల్లో ఆసక్తి నెలకొంది. మొదట ఈ చిత్రాన్ని మార్చి 19న విడుదల చేయాలని ప్లాన్ చేసిన మేకర్స్, తర్వాత జూన్ 4కి వాయిదా వేశారు. అయితే ఇప్పుడు ఆ తేదీకి కూడా సినిమా విడుదల కావడం లేదని యష్ స్వయంగా ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయన భావోద్వేగపూరితమైన ప్రకటన విడుదల చేశారు. సినిమా కాన్ ఈవెంట్‌లో 'టాక్సిక్'కు వచ్చిన అంతర్జాతీయ స్పందనతో తమ బాధ్యత మరింత పెరిగిందని యష్ తెలిపారు. భారతీయ సినిమాను గ్లోబల్ స్థాయిలో నిలబెట్టేలా ఈ చిత్రాన్ని విడుదల చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామని చెప్పారు. షూటింగ్ పూర్తయినప్పటికీ, ప్రస్తుతం గ్లోబల్ డిస్ట్రిబ్యూషన్, అంతర్జాతీయ భాగస్వామ్యాలపై పని జరుగుతోందని వెల్లడించారు. అందుకే త్వరలో కొత్త విడుదల తేదీని ప్రకటిస్తామని తెలిపారు. ఇక ఈ వాయిదా వెనుక మరికొన్ని కారణాలు కూడా ఉన్నట్లు ఇండస్ట్రీ వర్గాలు చెబుతున్నాయి. దాదాపు రూ.700 కోట్ల భారీ బడ్జెట్‌తో తెరకెక్కుతున్న ఈ చిత్రానికి ఓటీటీ హక్కులపై చర్చలు కొనసాగుతున్నాయి. ఒక ప్రముఖ సంస్థ రూ.110 కోట్లు ఆఫర్ చేయగా, నిర్మాతలు మాత్రం కనీసం రూ.250 కోట్లు ఆశిస్తున్నట్లు సమాచారం.





# బన్సాలీ సినిమాలో రామ్‌చరణ్ బదులు..ధనుష్

ప్రముఖ బాలీవుడ్ దర్శకుడు సంజయ్ లీలా భన్సాలీ తన సినిమాల ద్వారా విజువల్ గ్రాండియర్‌కు కొత్త అర్థం తీసుకొచ్చిన వ్యక్తిగా పేరు పొందారు. ఆయన తెరకెక్కించే ప్రతి చిత్రం విజువల్ వండర్‌గా నిలుస్తూ ప్రేక్షకులను ఆకట్టుకుంటుంది. ఈ నేపథ్యంలో భన్సాలీ ప్రొడక్షన్స్ నుంచి రాబోతున్న మరో భారీ ప్రాజెక్ట్ ఇప్పుడు సినీ పరిశ్రమలో హాట్ టాపిక్‌గా మారింది. భారీ బ్జడెట్‌తో రూపొందనున్న ఈ మైథోలాజికల్ జంగిల్ డ్రామాను పి.ఎస్. మిత్రన్ దర్శకత్వం వహించనున్నారు. ఈ సినిమాతో మిత్రన్ హిందీ చిత్రసీమలోకి అడుగుపెడుతున్నారు. అడవి నేపథ్యంలో సాగే పౌరాణిక గాథను అత్యాధునిక సాంకేతికతతో, భన్సాలీ స్టైల్ గ్రాండియర్‌తో తెరకెక్కించేందుకు చిత్ర బృందం సిద్ధమవుతోంది. ఈ ప్రతిష్టాత్మక ప్రాజెక్ట్ కోసం మొదట మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ పేరును పరిశీలించినట్లు సమాచారం. ఈ పాత్రకు ఆయన సరిపోతారని భావించినప్పటికీ, పలు కారణాల వల్ల ఆ ప్రాజెక్ట్ ఆయన చేతిలోకి రాలేదని తెలుస్తోంది. ప్రస్తుతం ఈ అవకాశం కోలీవుడ్ స్టార్ హీరో ధనుష్‌ని వరించిందనే వార్తలు వినిపిస్తున్నాయి.

# బుర్ర తక్కువై.. హనుమాన్ వదులుకున్నా

నటి ఫరియా అబ్దుల్లా వ్యాఖ్యలు బాక్సాఫీస్ వద్ద సంచలన విజయాన్ని అందుకున్న హనుమాన్ సినిమా చిన్న సినిమాగా మొదలై ప్రపంచవ్యాప్తంగా భారీ వసూళ్లు సాధించి కొత్త రికార్డులు సృష్టించిన సంగతి తెలిసిందే. ఈ చిత్రంతో నటీనటులందరికీ మంచి గుర్తింపు లభించింది. అయితే ఈ బ్లాక్‌బస్టర్ అవకాశాన్ని తానే మిస్ చేసుకున్నానని నటి ఫరియా అబ్దుల్లా చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు వైరల్ అవుతున్నాయి.తాజాగా తన కొత్త సినిమా గాయపడ్డ సింహం మే 1 విడుదలవుతున్న సందర్భంగా ప్రమోషన్స్‌లో పాల్గొన్న ఫరియా, తన కెరీర్‌కు సంబంధించిన ఆసక్తికర విషయాలను పంచుకుంది. 'జాతిరత్నాలు' తర్వాత ఇండస్ట్రీలోకి వచ్చిన సమయంలో కథల ఎంపికపై సరైన అవగాహన లేకపోవడం వల్ల 'హనుమాన్' వంటి మంచి ప్రాజెక్ట్‌ను కోల్పోయానని ఆమె తెలిపింది. ఆ సమయంలో స్క్రిప్ట్‌లను ఎలా అంచనా వేయాలో తెలియదు. మంచి కథను గుర్తించడంలో తప్పు చేశాను. నిజం చెప్పాలంటే అప్పుడు ఆలోచించకుండా 'నో' చెప్పాను. ఇప్పుడు సినిమా రిజల్ట్ చూసాక చాలా బాధగా ఉంది అంటూ ఫరియా తన మనసులోని మాటను బయటపెట్టింది. దర్శకుడు ప్రశాంత్ వర్మ, హీరో తేజ సజ్జాలను ఎక్కడ కలిసినా ఈ విషయాన్ని గుర్తుచేసుకుంటానని కూడా తెలిపింది. ఆ సమయంలో నిజంగా నాకు బ్రెయిన్ లేదు. బుద్ధిలేక నో చెప్పాను.. నిజానికి నాకు కథను ఎలా జడ్జ్ చేయాలో తెలియదు. ఎంచుకునే విషయంలో జాగ్రత్తగా ఆచితూచి అడుగులు వేస్తానని తెలిపింది.



# నెట్‌ఫ్లిక్స్‌కు ఫిక్సయిన డెకాయిట్




టాలీవుడ్ యువ కథానాయకుడు అడివి శేష్, అందాల నటి మృణాల్ ఠాకూర్ కలిసి నటించిన యాక్షన్ ప్రేమకథ డెకాయిట్ ఇప్పుడు డిజిటల్ వేదికపైకి రానుంది. థియేటర్లలో విడుదలైనప్పటి నుంచి ఈ చిత్రం మంచి వసూళ్లతో బాక్సాఫీస్ వద్ద దూసుకెళ్లింది. విడుదలై మూడు వారాలు దాటినా కూడా వారాంతాల్లో గట్టి కలెక్షన్స్ రావడం ఈ చిత్రం ఎంత పెద్ద విజయం సాధిస్తుందనేది తెలియజేస్తుంది. ఈ విజయానికి ప్రధాన కారణం హీరో అడివి శేష్ సహజ నటన, మృణాల్ ఠాకూర్ అభినయం. సంగీత దర్శకుడు భీమ్స్ సిసిరోలియో అందించిన నేపథ్య సంగీతం సినిమా భావోద్వేగాలను మరింత ఎలివేట్ చేసింది. కథలో యాక్షన్, ఎమోషన్, ప్రేమ వంటి అంశాలు ఎంతగానో ఆకట్టుకున్నాయి.. ఇప్పుడు ఇదే చిత్రం ఓటీటీలో ప్రేక్షకులను అలరించేందుకు సిద్ధమైంది. ప్రముఖ డిజిటల్ వేదిక నెట్‌ఫ్లిక్స్ ఈ చిత్ర స్ట్రీమింగ్ హక్కులను భారీ మొత్తానికి సొంతం చేసుకున్నట్లు సమాచారం. తాజా అప్‌డేట్స్ ప్రకారం, మే 8 నుంచి దేశవ్యాప్తంగా పలు భాషల్లో ఈ చిత్రం స్ట్రీమింగ్ కానుంది.